విద్యార్థుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా..

- నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- గ్రామగ్రామానా పాఠశాలల్లో అందజేత
- చిన్నారులతో మింగించిన వైద్య సిబ్బంది
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు


వెదిరేశ్వరం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


అంబాజీపేటలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం/అంబాజీపేట/కొత్తపేట/మలికిపురం/సఖినేటిపల్లి/ఆలమూరు/పి.గన్నవరం/అయినవిల్లి: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా.. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా.. గురువారం గ్రామగ్రామానా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది వివిధ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో ఈ మాత్రలను మింగించారు. వీటి ద్వారా పిల్లల కడుపులోని నులిపురుగులను నివారించవచ్చని, తద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటివి నివారించవచ్చని తెలిపారు.

- రావులపాలెం మండలం వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూలులో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యకు, విద్యార్థుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.
- అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ ఆధ్వర్యాన వైద్యాధికారి వి.గౌతమి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం హ్యూమన్ వలంటరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వై.రత్న కుమారి ఆధ్వర్యాన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి ఆధ్వర్యాన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.
- కొత్తపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మోడేకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీని ఎంపీపీ, వానపల్లి, అవిడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీల చైర్మన్ మార్గన గంధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు, హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ స్టేట్ మెంబర్ గూడపాటి రమాదేవి ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ కేఎస్‌ఎస్ హర్ష, డాక్టర్ పి.రవికుమార్, హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని బాలికలకు డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుమలత ఆధ్వర్యాన జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి మాత్రలు వేశారు. ఎంపీహెచ్‌ఏ వాడ సద్గుణరావు, హెచ్‌ఎం పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- మలికిపురం మండలం గుడిమెళ్లంక పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సర్పంచ్ నల్లి విజయ కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి అంజలీదేవి, వైద్యాధికారి ఎస్.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు. రామరాజులంక పాఠశాలలో ఎంపీపీ మేడిచర్ల సత్యావాణి మాత్రలు వేశారు. వైద్యాధికారి ఎం.దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.
- సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి పీహెచ్‌సీల వైద్య సిబ్బంది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. మోరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంతర్వేది దేవస్థానం సెయింట్ మేరీ ప్రైవేటు పాఠశాలల్లో ఎంపీపీ వీరా మల్లిబాబు, రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ యునుస్, డాక్టర్ పూర్ణచంద్రరావుల పర్యవేక్షణలో నిర్దేశిత మోతాదు ప్రకారం ఏఎన్‌ఎంలు మాత్రలు మింగించారు. ఈ మూడు పీహెచ్‌సీల పరిధిలో 7,321 మంది విద్యార్థులకు గాను తొలి రోజు 94.33 శాతం మందికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ రోజు మాత్రలు తీసుకోని పిల్లలకు 17వ తేదీన మాప్ అప్ రౌండ్ ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ పావని తెలిపారు. ఎంఈఓలు డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పి.లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీటీసీ సభ్యురాలు జాన లక్ష్మీదుర్గ సూర్యావతి, హెచ్‌ఎం శ్రీధర్ కృష్ణ, ముప్పర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- ఆలమూరు మండలంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ 92 శాతం పూర్తయింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల అధికారులు పి.భవానీ శంకర్, డి.మల్లికార్జున నేతృత్వంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది మండలంలోని 61 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, రెండు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 76 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 13,086 మంది విద్యార్థులు, చిన్నారులకు ఈ మాత్రలు మింగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి రోజు 12,039 మందికి ఈ మాత్రలు వేశారు. పెదపళ్ల పీహెచ్‌సీలో 5,843 మందికి గాను 5,245 మందికి, చొప్పెల్ల పీహెచ్‌సీలో 7,243 మందికి గాను 6,794 మందికి మాత్రలు అందించారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- పి.గన్నవరం ఎంపీపీ అంబటి భూలక్ష్మి నరేంద్రపురం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కొక్కిరి లక్ష్మి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.
- అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బి.మంగాదేవి శ్రీ నరహరిశెట్టి వేంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీ దేవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.శామ్ అబెల్, బి.రఘు తదితరులు పాల్గొన్నారు. ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూలులో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, పీహెచ్‌సీ సిబ్బంది నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

కష్టాల్లో తోడుగా నిలిచే నేత సీఎం జగన్

- రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- మగటపల్లిలో గడప గడపకూ..


గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

మామిడికుదురు: కష్టం వచ్చినప్పుడు నేనున్నానంటూ ప్రజలను ఆదుకునే నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మగటపల్లిలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఉంటానంటూ భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి విపక్షాల అడ్డంకి


కేశనపల్లిలో రోడ్డుకు అడ్డంగా వేసిన స్తంభాలు

మలికిపురం: కేశనపల్లిలో రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపక్షాలు అడ్డంకి సృష్టించాయని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని పెట్రోల్ బంకు నుంచి రాయుడు వారి గ్రూపునకు వెళ్లే మార్గం అభివృద్ధి పనులను ప్రభుత్వం ఇటీవల రూ.25 లక్షల మార్కెటింగ్ నిధులతో ప్రారంభించింది. పనులు ప్రారంభమైన తరువాత కొంతమంది రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమించి అడ్డుకట్టలు వేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. దీనిపై రోడ్డు పరిధిలోని ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అడ్డుగా స్తంభాలు వేసి, రోడ్డు పనులకు ప్రతిపక్షాలు ఆటంకం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. రోడ్డు పనులను అడ్డుకోవడం విపక్షాలకు తగదని సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, సుంకర బాబ్జీ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.25 వేల ఆర్థిక సహాయం

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామానికి చెందిన నిరుపేద బొంతు వెంకటరమణ చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అతడికి గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కట్టా భాస్కర్, సభ్యులు సమకూర్చిన రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని శెట్టిబలిజ సంఘం నేతలు గురువారం అందజేశారు.

5 నామినేషన్లు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ 13వ వార్డు ఉప ఎన్నికకు 5 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి బి.మంగాదేవి గురువారం తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసిందని, వీటిని శుక్రవారం పరిశీలిస్తామని చెప్పారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రాజోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఎస్.బాలాజీ తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖలకు చెందిన నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

గద్దర్ మృతికి సంతాపం

సఖినేటిపల్లి: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి నియోజకవర్గ రైతుసంఘ నాయకులు సంతాపం తెలిపారు. మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (సీపీసీ) కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజల పక్షాన ప్రతిధ్వనించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కొనియాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

హిరోషిమా - నాగసాకి దినోత్సవం

రాజోలు: హిరోషిమా – నాగసాకి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాంకేతిక సలహా మండలి ఆధ్వర్యాన విద్యార్థులకు గురువారం ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. రాజోలు బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓలు నల్లి మనోహర్, టీఎస్‌కేడీ ప్రసాదరావు ఆధ్వర్యాన పోటీలు జరిగాయి. శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రగతి సాధించాలని, అణ్వాయుధాలను విడనాడాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుహాసిని, కో ఆర్డినేటర్ కేఆర్ఎస్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- వెదిరేశ్వరంలో గడప గడపకూ..


వెదిరేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వెదిరేశ్వరం సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ ప్రభుత్వంలో వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో వెదిరేశ్వరంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.33,50,72,349 మేర లబ్ధి చేకూర్చామని చెప్పారు. వివిధ డ్రైనేజీలు, రోడ్లు, గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మించి, ప్రారంభించుకున్నామని వివరించారు. నాడు–నేడు పథకంలో జెడ్పీ హైస్కూల్‌ను అభివృద్ధి చేసుకోవడంతో పాటు, ప్రహరీ నిర్మించామన్నారు. ప్రస్తుతం అదనపు తరగతులు నిర్మాణ దశలో ఉన్నాయని, 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం చివరి దశలో ఉందని, అతి త్వరలోనే పనులు పూర్తి చేసి, వీటిని ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం హైస్కూలులో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల ముందు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సెల్ఫీ దిగారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలివీ అని వివరించారు. గ్రామంలోని వెల్నెస్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న మందుల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్ బొక్కా కరుణాకరం, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘానికి రూ.3 లక్షల మంజూరు

వెదిరేశ్వరంలో నిర్మించిన రజక కమ్యూనిటీ భవనాన్ని జగ్గిరెడ్డి ప్రారంభించారు. జెడ్పీ నుంచి మంజూరైన రూ.3 లక్షల నగదును సంఘ సభ్యులకు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం

సామాజిక న్యాయం పాటిస్తూ, అన్ని వర్గాల వారికీ పరిపాలనలో సముచిత స్థానం కల్పిస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీయేనని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. కొత్తగా ఏర్పడిన అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ తొలి చైర్మన్‌గా నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గం నుంచి గొల్లపల్లి డేవిడ్‌రాజును, కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన రెడ్డి రవిదేవిని, ఆలమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యనమదల నాగేశ్వరరావును నియమించారని వివరించారు. రవిదేవి తదితరులు వెదిరేశ్వరంలో జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, కొత్తపేట ఏఎంసీ చైర్మన్ రవిదేవి దంపతులను, వారితో వచ్చిన అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్‌ను, ఆలమూరు ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ, చరిత్రలోనే తొలిసారిగా చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా షెడ్యూల్ కులాలకు చెందిన సూరిబాబును నియమించామన్నారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆలమూరు: ఓఎన్‌జీసీ కార్యకలాపాలు చేపట్టే ప్రదేశాల్లో రైతులకు, గ్రామస్తులకు తగిన ప్రాధాన్యం ఇచ్చి, గ్రామాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కోరారు. మండలంలోని పినపళ్లలో మురుగు కాలువకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన ఓఎన్‌జీసీ రిగ్ వల్ల సుమారు 3 కిలోమీటర్ల రోడ్డు ధ్వంసమైంది. ఈ విషయాన్ని సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ సభ్యుడు పెదిరెడ్డి పట్టాభి, మాజీ సర్పంచ్ కోట బూరయ్య, చామకూరి శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని జగ్గిరెడ్డి రాజమహేంద్రవరంలోని ఓఎన్‌జీసీ కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన చొరవతో సుమారు 1.7 కిలోమీటర్ల మేర గ్రావెల్ రహదారిని బీటీ రహదారిగా మార్చేందుకు రూ.36 లక్షలు మంజూరయ్యాయి. ఆ రహదారి వెంబడి ఉన్న ఓఎన్‌జీసీ, పేపర్ మిల్లుకు వెళ్లే భారీ వాహనాల వల్ల 12 అడుగుల వెడల్పు రోడ్డు సరిపోదని భూమి పూజకు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. దీంతో ఓఎన్‌జీసీ కన్‌స్ట్రక్షన్స్ ఈఈ సీహెచ్ సెల్వతో జగ్గిరెడ్డి మాట్లాడి, 14 అడుగుల రోడ్డు నిర్మించేందుకు ఒప్పించారు. వాహనాల రద్దీని బట్టి భవిష్యత్‌లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారిని విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్న విజ్ఞప్తికి ఓఎన్‌జీసీ ప్రతినిధులు అంగీకరించారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మాణానికి జగ్గిరెడ్డి భూమి పూజ చేశారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెప్పింది చెప్పినట్టు అమలు చేశారు

- ఆ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది
- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- వీరవల్లిపాలెంలో గడప గడపకూ..


గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన సంక్షేమ పథకాలను చెప్పినట్టుగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే మరోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వీరవల్లిపాలెం బొమ్మరాళ్ల తిప్పలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిచారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలోనూ ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని అన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వీటిని తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మిండగుదిటి రాంబాబు, శిరీష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎమ్మెల్యే చిట్టిబాబు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.45 లక్షలతో నిర్మించిన తొత్తరమూడి–1 సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అయినవిల్లి విఘ్నేశ్వరునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

క్షతగాత్రులకు పరామర్శ

మామిడికుదురు: ఆబోతు దాడిలో గాయపడిన నగరం గ్రామానికి చెందిన క్షతగాత్రులను ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు. రాజోలు మండలం తాటిపాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సకీనా, అబ్బాస్, జమైన్, జహెరా, హుస్సేన్ బేగం, హుస్సేన్ అలీ, వలంటీర్ నాగేంద్రను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు సూచనల మేరకు తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఆబోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని నగరం గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట నగరం ఎస్సై షేక్ జానీబాషా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్ ఉన్నారు.

అవసరం మేరకే పురుగు మందులు వాడాలి

అంబాజీపేట: పురుగు మందులు విచక్షణరహితంగా కాకుండా అవసరం మేరకే వాడాలని వ్యవసాయ శాఖ పి.గన్నవరం సహాయ సంచాలకుడు ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన ఇరుసుమండలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ, వరి నాట్లు వేసిన 40 రోజుల వరకూ ఆకుముడత వంటి పురుగులు ఆశిస్తాయన్నారు. పిలకలు పెట్టే, పెరుగుదల దశల్లో పురుగు మందులు వాడనవసరం లేదని సూచించారు.

రూ.1.48 కోట్లతో అభివృద్ధి పనులు

కొత్తపేట: గత రెండేళ్లలో మండల పరిషత్ ద్వారా మండలంలో రూ.1.48 కోట్లతో సీసీ, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్లు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎంపీపీ మార్గన గంగాధరరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం, మండల పరిషత్ కార్యాలయం ఆర్చి గేటు ప్రారంభోత్సవం సందర్భంగా మండల ప్రగతి, చేపట్టిన, పూర్తయిన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. 2022–23లో రూ.28 లక్షలతో 12 పనులు చేపట్టగా 9 పూర్తయ్యాయని, 3 నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 గ్రామాల్లో రూ.1.20 కోట్లతో 70 పనులు చేపట్టగా 51 పూర్తయ్యాయని, 19 నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ ముఖద్వారంలో నిర్మించిన ఆర్చి గేటును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభిస్తామని ఎంపీపీ తెలిపారు. అదే ప్రాంగణంలో నా భూమి – నా దేశం స్థూపాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

ఏడీఎంహెచ్‌ఓ సుమలతకు సత్కారం


సుమలతను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

ఆలమూరు: కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (ఏడీఎంహెచ్‌ఓ), చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సుమలతకు గురువారం ఘన సత్కారం జరిగింది. ఇటీవల ఆమె కొత్తపేట మండలం అవిడి పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా చొప్పెల్ల పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ ఆధ్వర్యాన సత్కరించారు. మండల ప్రజలకు పదేళ్ల పాటు సేవలందించిన సుమలతను వక్తలు కొనియాడారు. వైద్యాధికారులు డి.మల్లికార్జున, డి.సువర్చలానాయుడు, సూపర్‌వైజర్లు ఎస్.వెంకటేశ్వర్లు, సీహెచ్ బేబీ పాల్గొన్నారు.

రేపు సంస్కృత పాఠశాల శత జయంతి మహోత్సవం

పి.గన్నవరం: నరేంద్రపురంలో ఈ నెల 12న సుబ్రహ్మణ్య భారతీ భవన సంస్కృత కళాశాల శత జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీపీ త్సల్లా బిందుమాధవరావు, మాజీ సర్పంచ్ త్సల్లా వెంకట సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. ఈ సందర్భంగా త్సల్లా సుబ్రహ్మణ్యం (దత్తుడు) జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ, వేదస్వస్తి, ఆత్మీయ సమ్మేళన తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తిని భావితరాలకు అందించాలి


దీపాలు చేతపట్టి స్వాతంత్య్ర వీరులకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ మార్గన, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి తదితరులు

కొత్తపేట: స్వాతంత్య్ర స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాలను బిళ్లకుర్రులో గురువారం ప్రారంభించారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నా భూమి – నా దేశం స్థూపాన్ని ఎంపీపీ ఆవిష్కరించారు. అక్కడ దీపాలు వెలిగించి స్వాతంత్య్ర సంగ్రామంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. మట్టిని గుప్పెట్లో పట్టుకుని దేశసేవకు ప్రతి ఒక్కరం అంకితమవుదాం అంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. వసుధకు వందనంలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్కో మొక్క నాటి, సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

డంపింగ్ సమస్య పరిష్కరించాలి

అంబాజీపేట: మాచవరంలో అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వార్డు సభ్యులు డీపీఓ కె.కృష్ణకుమారికి గురువారం వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇవ్వడంతో హడ్కో కాలనీ, మాచవరంలో చెత్త డంపింగ్ చేశామన్నారు. గడువు ముగియడంతో స్థానికులు చెత్త వేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. చెత్త డంపింగ్‌కు స్థలం కొనుగోలు చేసి, శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

దేవాంగ కమిటీ ప్రమాణ స్వీకారం

మామిడికుదురు: మొగలికుదురులోని జగన్నపేట చిన్న వీధిలో టీడీపీ బీసీ దేవాంగ సాధికార కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ దేవాంగ సాధికార కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో నూతన కమిటీ బాధ్యతలు చేపట్టింది. కన్వీనర్‌గా కొండా జగదీశ్వరరావు, 14 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రులు నిమ్మల కిష్టప్ప, గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ గంటి హరీష్ మాధుర్ పాల్గొన్నారు.

13న శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఈ నెల 13న స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. శ్రావణ బహుళ ద్వాదశి సందర్భంగా ఆర్జిత సేవగా కల్యాణం ఏర్పాటు చేశామన్నారు. ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్, ఆలయం వద్ద కౌంటర్‌లో కల్యాణం టికెట్లు ముందస్తుగా తీసుకోవచ్చన్నారు.

పరిశోధన కేంద్రంలో రైతులకు స్థలం కేటాయించాలి

మలికిపురం: అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రంలో రైతులకు స్థలం కేటాయించాలని కొబ్బరి అభివృద్ధి బోర్డు మాజీ సభ్యుడు ముదునూరి సత్య సీతారామరాజు కోరారు. లక్కవరంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థలం కేటాయింపునకు రూ.3 లక్షలు డిపాజిట్ చేస్తామంటూ గతంలో ప్రతిపాదించినా అధికారులు ఏ విషయం చెప్పడం లేదని అన్నారు.

మొగలికుదురులో మహిళా శక్తి

మామిడికుదురు: మొగలికుదురు గ్రామంలో గురువారం టీడీపీ మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు మాట్లాడుతూ, టీడీపీ హయాంలోనే మహిళలకు గుర్తింపు వచ్చిందని అన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు


ఆలమూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ ఐవీ రావు తదితరులు

ఆలమూరు/మామిడికుదురు: యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరు యూటీఎఫ్ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులను సత్కరించి, ఆశీర్వచనాలు స్వీకరించారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడు జి.భాస్కరరెడ్డి, ఎంఈఓలు సి.సాలెంరాజు, పీపీ సుబ్బరాజు, నేతలు ఎస్.జ్యోతిబసు, డీవీ రాఘవులు, మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకటన్నబాబు ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షురాలు ఏవీ శ్యామలావతి, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి

ఆలమూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మడికి సర్పంచ్ యు.లక్ష్మీ మౌనిక ఆధ్వర్యాన నా భూమి – నా దేశం కార్యక్రమం గురువారం జరిగింది. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించి, పర్యావరణాన్ని కాపాడే దిశగా అడుగులు వేద్దామని ప్రతిజ్ఞ చేశారు. నా భూమి – నా దేశం శిలాఫలకాన్ని పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, సర్పంచ్ లక్ష్మీమౌనికతో కలిసి ఆవిష్కరించారు.